RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 301 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | శనివారం, 4 మే 2024 | పేజీలు : 4 | వెల : 2/-

# హైకమాండ్‌ను 'ఫిదా' చేసిన రేవంత్

## పెద్దల నుండి ప్రశంసలు



ప్రచారం వేళ బిజెపిని టార్గెట్ చేస్తున్న తీరుకు 'ఇండియా' ఫిదా!!

హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల వేళ.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కాంగ్రెస్ అధిష్టానం ప్రశంసలు కురిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికలో ప్రచారంలో రేవంత్ లేవనెత్తుతున్న అంశాలు అధికార బీజేపీని ఇరుకున పెడుతున్నాయి. ఓటర్లను ఆలోచింపజేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ గ్రాఫ్ తెలంగాణతోపాటు సౌత్, నార్త్ ఇండియాలో ప్రభావం చూపుతోంది. దీంతో రేవంత్ క్యాంపెయిన్‌కు కాంగ్రెస్ అధిష్టానం ఫిదా అవుతోంది.

**హైలేట్ అవుతున్న అంశాలు..** రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా లేవనెత్తుతున్న కొన్ని అంశాలు సంచలనం అవుతున్నాయి. వాటినే హైలేట్ చేస్తున్నారు. ఇవి బీజేపీకి ఇబ్బందిగా మారతున్నాయి. అలాంటి వాటిలో రిజర్వేషన్ల రద్దు అంశం ఒకటి. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దవుతాయన్న అంశాన్ని రేవంత్ బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ఇందుకు ఆధారాలను కూడా చూపుతున్నారు. బీజేపీ మాతృసంస్థ ఆర్‌ఎస్ఎస్ వందేళ్ల ఎజెండా రిజర్వేషన్ల రద్దు అని ప్రచారం చేస్తున్నారు.

**చార్‌సౌ పార్ అందుకే అని..** ఇక రిజర్వేషన్లను బీజేపీ రద్దు చేస్తుందనడానికి మరో కారణం కూడా హైలేట్ అవుతోంది. ఇందులో బీజేపీ నినాదమే రేవంత్‌కు ఆయుధంగా మారింది. బీజేపీ చార్ సౌ పార్ నినాదం అందుకే అని రేవంత్ విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళు_న్నారు. తక్కువ మెజారిటీ వస్తే రిజర్వేషన్ల రద్దుకు ఆటంకం కలుగుతుందని 400 సీట్లు అడుగుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈవాదనను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.

**క్లారిటీ ఇస్తున్న బీజేపీ..** ఇక రేవంత్ చేస్తున్న రిజర్వేషన్ల రద్దు ప్రచారంపై బీజేపీ అలర్ట్ అయింది. రేవంత్ ఆరోపణలు తిప్పి కొట్టడంతోపాటు ఆ పార్టీ నేతలు వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

మరోవైపు రేవంత్ వ్యాఖ్యలపై జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. సౌత్ ఇండియాతోపాటు నార్త్ ఇండియాలోనూ రేవంత్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఇది కాంగ్రెస్‌కు ఎన్నికల్లో మేలు చేస్తుందని అధిష్టానం భావిస్తోంది. ఈ క్రమంలోనే రేవంత్ ను ఏఐసీసీ అగ్రనేతలు అభినందించినట్లుగా సమాచారం. బీజేపీ వైఖరిని మరింత ఎండగట్టాలని, పార్టీ నుంచి సహకారం ఉంటుందని అధిష్టానం భరోసా కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది.

## వీడియో కాన్ఫరెన్స్ వద్దు..

### కోర్టుకు నేరుగా హాజరుపర్చండి.. కవిత విజ్ఞప్తి..

న్యూఢిల్లీ, మే 03: ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత జ్యూడీషియల్ కస్టడీ మే 7వ తేదీతో ముగియనుంది. దీంతో ఆమెను కోర్టు ముందు హాజరుపరచనున్నారు అధికారులు. అయితే, తనను కోర్టుకు నేరుగా హాజరుపరచాలని.. వీడియో కాన్ఫరెన్స్ వద్దని కోర్టును కోరారు కవిత. ఈ మేరకు కోర్టుకు దరఖాస్తు చేసుకున్నారు కవిత. ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కవిత విచారణ ఖైదీగా తీహార్ జైల్లో జ్యూడీషియల్ కస్టడీలో ఉన్నారు. అయితే, గతంలో కస్టడీ ముగిసినప్పుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమెను కోర్టు ధర్మాసనం




ఎదుట హాజరుపరిచారు అధికారులు. ఇప్పుడు కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరుపరిచే అవకాశం ఉంది. దీంతో.. ఈ విచారణకు నేరుగా హాజరుపరచాలని కోరుతూ కోర్టు అప్లికేషన్ పెట్టుకున్నారు కవిత. ఈ కేసులో కవిత అరెస్టైనప్పటి నుంచి నాలుగు సార్లు కస్టడీని పొడించింది రౌస్ అవెన్యూ కోర్టు ధర్మాసనం. కోర్టుకు హాజరైన సందర్భంగా కుటుంబ సభ్యులను కలిసే అవకాశం ఏర్పడింది. అయితే, గతంలో కోర్టులో విచారణకు హాజరైన కవిత.. మీడియాతో మాట్లాడారు. ఈ చర్యపై ట్రయల్ కోర్టు జడ్జి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తదుపరి విచారణకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుపరిచారు అధికారులు. కానీ, ఈసారి అలా చేయబోనని.. తనను నేరుగా కోర్టుకు హాజరుపరచాలని కోర్టును కోరారు ఎమ్మెల్సీ కవిత. మరి దీనిపై న్యాయస్థానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే తెలియాలి.

## ఆదిలాబాద్‌లో మారుతున్న లెక్కలు..!



# త్రిముఖ పోరులో గెలుపెవరిది..?

విభిన్న తెగల జాతులు గల అదిలాబాద్ పార్లమెంటు ఎన్నికల్లో నియోజకవర్గంలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయిన రోజు నుంచి నేటి వరకు రకరకాలుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఎన్నికల ఫలితాలు ఏ విధంగా ఉంటాయని ఓటర్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 7 అసెంబ్లీ స్థానాలు ఉండగా ఇందులో అన్ని ప్రాంతాల్లో గిరిజన జాతుల ఓటర్లు ఉన్నారు. 7 అసెంబ్లీ నియోజవర్గాల్లో జరిగిన ఎన్నికలలో కేవలం ఒకే ఒక సీటు కాంగ్రెస్ దక్కింది. 4 చోట్ల బీజేపీ అభ్యర్థులు గెలుపొందగా, 2 చోట్ల బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు.

**త్రిముఖ పోరు ఎవరికీ కలిసి వస్తుందో...** అదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో మూడు ప్రధాన పార్టీలు సైతం ఆదివాసులకి టికెట్లు కేటాయించారు. పార్లమెంటు నియోజకవర్గం లో సుమారు 16.14 లక్షల ఓటర్లు ఉన్నారు. 2019 పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను చూస్తే భారతీయ జనతా పార్టీ అభ్యర్థికి 3,77,374 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి గొడెం నగేష్ కు 318,814 ఓట్లు వచ్చాయి, అదే విధంగా కాంగ్రెస్ తరపున పోటీ చేసిన రాథోడ్ రమేష్ కి 314,238 ఓట్లు పోలయ్యాయి, ప్రస్తుతం గోడెం నగేష్, రాథోర్ రమేష్ లు ఓకే గొడుగు రావడంతో సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవాలని బీజేపీ చూస్తోంది.

ఇక కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ గతంలో ఆదివాసి పోరాట సంఘం రాష్ట్ర నాయకత్వానికి బాధ్యత వహించింది. దీంతో లంబాడాలు సుగుణను ఆదరిస్తారా లేదా అన్నది అనుమానంగా మారింది. అయితే అధికార పార్టీకి చెందిన మంత్రి సీతక్క, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. అదిలాబాద్ పార్లమెంటు సీటుపై బలమైన ఆశలు పెట్టుకుని ప్రచారం నిర్వహిస్తున్నారు. ఒక గోండు జాతికి చెందిన మహిళగా మొదటిసారి రంగంలోకి దిగుతున్న సుగుణను మంత్రి సీతక్క వెంట వేసుకొని మరీ ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం అనేక సంక్షేమ ఫలాలు గిరిజన జాతులకు అందిస్తోందని, అందుకే స్థానికంగా వెడమ బొజ్జు ను ఎమ్మెల్యేగా గెలిపించారని మంత్రి సీతక్క తెలుపుచున్నారు.

**టిఆర్ఎస్...** పార్టీ నుంచి పోటీ చేస్తున్న ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే మాత్రం సక్కు పార్లమెంట్ అభ్యర్థిగా రంగంలోకి దిగారు, ఆత్రం సక్కు బలాబలాలను పరిశీలిస్తే గతంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వంలో కలిసి పని చేశారు, నియోజవర్గంలో మంచి పేరున్న నాయకుడిగా రాణించారు. సొంత నియోజకవర్గంలో ఓటు బ్యాంకు పదిలంగా ఉన్నప్పటికీ మిగతా నియోజకవర్గాల్లో అంతంత మాత్రంగానే ఉంది,

**మైనార్టీలు మైదాన ప్రాంతం ఓట్లే కీలకం...** పార్లమెంటు నియోజకవర్గం ఎన్నికలలో అదిలాబాద్ లో మైనార్టీలు, మైదాన ప్రాంత ఓట్లు కీలకం కానున్నాయి, ప్రస్తుతం పోటీ చేసిన అభ్యర్థులు గిరిజన తెగల వారు కావడంతో వారి వారి తెగలలో ఓట్లు చీలి పోనున్నాయి, ఎవరి అభిమానం ప్రకారం వారికి ఓటు వేసినప్పటికీ ముస్లిం మైనారిటీ ఓట్లు గెలుపు ఓటమి నిర్ణయిస్తాయని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. మొత్తం ఏడు సెగ్మెంట్లలో అదిలాబాద్ మంచిర్యాల్ నిర్మల్ ఖానాపూర్ లక్సెట్టిపేట మున్సిపాలిటీలలో జనరల్ ఓట్లు అధికంగా ఉన్నాయి, వీరు ఏ పార్టీకి ముగ్గు చూపితే ఆ పార్టీ గెలుపు ఖాయమని తెలుస్తుంది.

**కాంగ్రెస్ లోకి మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి...** బీఆర్ఎస్ కు చెందిన మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి కాంగ్రెస్ లో చేరారు, టిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి రాష్ట్ర కాంగ్రెస్ వివరాలు ఇన్చార్జి దీపా దాస్ మున్షి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఎన్నో రోజులుగా కాంగ్రెస్లో చేరుతారు అనే ప్రచారానికి తెర పడింది. ఉమ్మడి ఆదిలాబాద్ లోని కాంగ్రెస్ నాయకులు మాజీ మంత్రి రాకను వ్యతిరేకించినప్పటికీ లైన్ క్లియర్ చేశారు. ఇప్పటికే స్థానికంగా ఉన్న డిసిసి అధ్యక్షులు శ్రీహరి రావు ఆధ్వర్యంలో కార్యకర్తలు అనేక ఆందోళన చేశారు, అయినప్పటికీ. ఇంద్రకరణ్ రెడ్డి మొదట తన అనుచర వర్గాన్ని కాంగ్రెస్ పార్టీలోకి పంపించి తదనంతరం తను పార్టీలో చేరారు. నిర్మల్ నియోజకవర్గం లో గత కొన్ని ఏళ్లుగా టిఆర్ఎస్ పార్టీలో ఉన్న కార్యకర్తలు నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు నిర్మల్ జిల్లా లో చర్చనీయాంశంగా మారాయి. నిన్నటి వరకు కాంగ్రెస్ వర్సెస్ టిఆర్ఎస్ అన్నట్లుగా ఉండే స్థానిక రాజకీయం మంత్రి చేరికతో కాంగ్రెస్ వర్సెస్ బిజెపిగా మారిపోయింది.




# హత విధి ఏమిటీ ఈ పరిస్థితి

## ఒకే పేరుతో వేర్వేరు అభ్యర్థులు

హైదరాబాద్ : తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల సమయం దగ్గరపడింది. ఇప్పటికే అభ్యర్థులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. తక్కువ సమయమే మాత్రమే ఉండటంతో మరింత దూకుడు పెంచాలని చూస్తున్నారు. గెలుపుపై లెక్కలు వేసుకుంటూ ఏ చిన్న పొరపాటుకు అవకాశం ఇవ్వొద్దని భావిస్తున్నారు. ప్రధాన పార్టీలకు చెందిన పలువురు అభ్యర్థులకు సరికొత్త టెన్షన్ మొదలైంది. ఒకే పేరు ఉన్న అభ్యర్థులు బరిలో ఉండటంతో ఓట్లు చీలే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇదే విషయంపై చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి తాజాగా హైకోర్టును ఆశ్రయించారు.కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేరు ఉన్న మరో అభ్యర్థి ఇక్కడ పోటీ చేస్తున్నారు. దీంతో అలర్ట్ అయిన బీజేపీ అభ్యర్థి విశ్వేశ్వర్ రెడ్డి ఈసీకి ఓ వినతిపత్రం ఇచ్చారు. సీరియల్ నెంబర్లు దూరంగా కేటాయించాలని కోరారు. ఒకే చోట ఉంటే ఓటర్లు అయోమయానికి గురవుతారని లేఖలో ప్రస్తావించారు. ఇదే విషయంపై తగిన నిర్ణయాన్ని త్వరగా తీసుకోవాలని ఈసీకి హైకోర్టు సూచించింది. ఇదే తరహాలో నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ లోనూ ఉంది. కాంగ్రెస్ అభ్యర్థిగా తాటిపర్తి జీవన్ రెడ్డి పోటీ చేస్తున్నారు. అయితే ఇండిపెండెంట్ అభ్యర్థిగా తుటుకూరు జీవన్ రెడ్డి బరిలో ఉన్నారు. ఇక నాగర్ కర్నూలు నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా మల్లు రవి పోటీలో ఉండగా%ొ%. డెమోక్రటిక్ రిఫామ్స్ పార్టీ తరపున అంబోజు రవి పోటీ చేస్తున్నారు.

**ఈ నియోజకవర్గాల్లోనూ సేమ్ సేన్ ...** భువనగిరి పార్లమెంట్ పరిధిలో చూస్తే బీఆర్ఎస్ తరపున క్యామ మల్లేశ్ పోటీ చేస్తున్నారు. ఇక్కడ యూ. మల్లేశ్ అనే వ్యక్తి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఇదే సెగ్మెంట్ లో బీజేపీ అభ్యర్థిగా డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ పోటీ చేస్తుండగా స్వతంత్ర అభ్యర్థిగా బూర నర్సయ్య అనే వ్యక్తి నామినేషన్ వేశాడు. అయితే ఇతని నామినేషన్ ను ఈసీ రిజెక్ట్ చేసింది. భువనగిరి పార్లమెంట్ పరిధిలోనే కాంగ్రెస్ అభ్యర్థిగా చామల కిరణ్ కుమార్ రెడ్డి పోటీ చేస్తున్నారు. ఇక్కడ ఇండిపెండెంట్ అభ్యర్థిగా అమిరెడ్డి కిరణ్ రెడ్డి బరిలో ఉన్నారు. కరీంనగర్ లో చూస్తే కాంగ్రెస్ నుంచి వెలిచాల రాజేందర్ ఉండగా స్వతంత్ర అభ్యర్థిగా పోతూరి రాజేందర్ పోటీ చేస్తున్నారు. ఖమ్మంలో బీఆర్ఎస్ నుంచి నామా నాగేశ్వర్ రావు పోటీ చేస్తుండగా. అల్ ఇండియా నేషన్ రక్షా పార్టీ తరపున లాకావత్ నాగేశ్వర్ రావు బరిలో ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా కాసిమెల్ల నాగేశ్వర రావు, కాటుకోజ్వాల నాగేశ్వరరావు అనే అభ్యర్థి కూడా ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నారు. మల్కాజ్ గిరిలో బీజేపీ నుంచి ఈటల రాజేందర్‌ఉండగా. ఇండిపెండెంట్ గా బుద్ధి రాజేందర్ నామినేషన్ వేశారు. నల్గొండ సెగ్మెంట్ లో చూస్తే బీఆర్ఎస్ నుంచి కంచర్ల కృష్ణారెడ్డి పోటీ చేస్తుండగా ఇండిపెండెంట్ అభ్యర్థిగా లింగం కృష్ణా ఉన్నారు. పెద్దపల్లిలో బీఆర్ఎస్ నుంచి కొప్పుల ఈశ్వర్ పోటీ చేస్తుండదగా దుర్గె ఈశ్వర్ అనే వ్యక్తి కూడా నామినేషన్ వేశారు. ఈసీ పరిశీలనలో ఈ పేరు రిజెక్ట్ అయింది. ఇదే నియోజకవర్గంలో బీజేపీ నుంచి శ్రీనివాస్ గోమాస ఉన్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా శ్రీనివాస్ దగ్గం అనే వ్యక్తి బరిలో ఉన్నాడు. జహీరాబాద్ లో చూస్తే కాంగ్రెస్ అభ్యర్థిగా సురేశ్ షెట్కర్ పోటీ చేస్తున్నారు. ఇక్కడ సురేశ్ విటల్ కుమార్ షెట్కర్ అనే వ్యక్తి ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఈసీ పరిశీలనలో ఈ పేరు తిరస్కరణకు గురైంది. ఒకే పేరుతో ఉన్న అభ్యర్థులు బరిలో ఉంటే ఓట్లు చీలే అవకాశం ఉంటుంది.

అయితే బ్యాలెట్ లో దూరంగా సదరు వ్యక్తుల పేర్లు ఉంటే ఓట్లు చీలే అవకాశం తక్కువగా ఉంటుంది. కానీ దగ్గర దగ్గరగా ఉంటే మాత్రం క్రాస్ ఓటింగ్ కు ఛాన్స్ ఉంటుంది. ఒకే పేర్ల విషయంలో ముఖ్యంగా ప్రధాన పార్టీల అభ్యర్థులకు ఇబ్బందులు రావొచ్చు. కొన్నిసార్లు విజయం అనేది కేవలం ఒక్క ఓటుతోనే మారిపోతుంది. కాబట్టి ఎన్నికల ప్రక్రియలో ఒక్క ఓటు కూడా కీలకమే!

## తలపట్టుకుంటున్న పార్టీలు

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## జగన్ లాంటి వ్యక్తిని బాబు ఎపుడూ చూడలేదా ?

టీడీపీ అధినేత నారా చంద్రబాబు రాజకీయంగా తలపండిన వారు. జీవితంలో కూడా ముప్పాతిక జీవితాన్ని ఆస్వాదించిన వారు. నాలుగున్నర దశాబ్దాల రాజకీయ జీవితం ఆయనది మూడు సార్లు సీఎం గా మరో మూడు సార్లు ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు ఎపుడూ చెప్పే మాట ఒక్కటే. తన రాజకీయ జీవితంలో జగన్ లాంటి వ్యక్తిని ఎపుడూ చూడలేదు అని. అలాంటి వ్యక్తిని తాను ఎపుడూ ఊహించలేదని. చంద్రబాబు రాజకీయ విమర్శల్గా దీనిని చూడాలా లేక జగన్ అందరి రాజకీయ నాయకుల మాదిరి లాంటి వారు కారా అన్న చర్చ అయితే ఎప్పటి నుంచో ఉంది. అయితే ఇక్కడ ఒక్క విషయంలో చంద్రబాబుతో ఏకీభవించాల్సిందే. ఎలాంగంటే జగన్ లాంటి పొలిటీషియన్ ని మాత్రం కేవలం చంద్రబాబు మాత్రమే కాదు ఏపీ మాత్రమే కాదు దేశం కూడా చూడలేదు అని. చంద్రబాబు నెగిటివ్ అప్రోచ్ లో చెబితే వైసీపీ నేతలు పాజిటివ్ అప్రోచ్ లో మా అధినేత లాంటి వారు ఎవరూ లేరు ఆయన రేర్ పొలిటికల్ పర్సనాలిటీ అని గొప్పగా చెబుతారు. ఎవరు ఏమి చెప్పినా ఎలా చెప్పినా న్యూట్రల్ పర్సన్స్ కూడా పాలిటిక్స్ లో జగన్ వేరే తీరు అని అంగీకరిస్తారు. అది ఎలా అంటే ఆయనకు పట్టుదల ఎక్కువ పట్టు మాత్రమే తెలుసు అని అంటారు. సాధారణంగా రాజకీయ నాయకులు పట్టూ విడుపూ రెండూ అనుసరిస్తారు. రాజకీయం అంటేనే టఫ్ జాబ్. అందులో ఎపుడూ విజయాలు రావు. అపజయాలు కూడా వస్తాయి అనుకున్నది కూడా జరిగిన సందర్భాలు ఉండవచ్చు లేకపోవచ్చు. అపుడు విడుపు మార్గం అవసరం అని అంటారు. వైఎస్ జగన్ తండ్రి మాజీ సీఎం దివంగత వైఎస్సార్ లో పట్టూ విడుపూ కూడా ఉన్నాయి. తెలుగు రాజకీయాల గురించే మాట్లాడుకుంటే రాష్టాన్ని పాలించిన సీఎంలు అందరికీ ఈ పట్టూ విడుపూ సూత్రాలు బాగా తెలుసు. జగన్ మాత్రం అలా కాదు తాను అనుకున్నది చేసుకుంటూ పోతారు అని అంటారు. అందులో పరాజయం పలు మార్లు వెక్కిరించినా ఆయన వెనక్కి తగ్గరు. ఆయన గుండె ధైర్యం కూడా ఎక్కువే అంటారు. అందుకే ఆయన సాధారణ రాజకీయ నాయకుల జాబితాలో ఉండరు. ఆయనకు ఆ పోలికలు నప్పవు. ఆయన సీఎం గా అయిదేళ్ల పాలన తీసుకుంటే విపక్షాన్ని ముప్పుతిప్పలు పెట్టారు అని వారు అంటారు తప్పు చేస్తే ఎవరైనా ఇంతే అన్నది వైసీపీ అధినేత నుంచి వచ్చే జవాబు. ఎంతదాకా అయినా అంటూ ముందుకు సాగే ఈ దూకుడే ఇపుడు ఏపీలో విపక్షం మొత్తాన్ని ఏకం చేసింది. చంద్రబాబు అరెస్ట్ దానికి పరాకాష్ట అని చెబుతారు. ఆ మధ్యన పవన్ కళ్యాణ్ ఏదో సభలో అన్నట్లుగా చంద్రబాబు లాంటి వారికే అరెస్టులు అనివార్యం అయితే మిగిలిన వారి సంగతేంటి అన్నదే విపక్ష శిబిరం ఆందోళన. భయం. ఇక అధికారంలో ఎవరు ఉన్నా విపక్షం తో రాజీలు సయోధ్యలు ఉంటాయి. వారూ వీరూ ఎక్కడో ఒక చోట సహకరించుకుంటారు. రాజకీయాన్ని అలాగే చూస్తారు. తమదాకా రానీయరు. కానీ జగన్ అలా కాదు విపక్షాన్ని ఆమడ దూరంలోనే ఉంచారు. అందుకే చంద్రబాబు అంటున్న మాట ఇలాంటి నేతను ఎక్కడా చూడలేదని. జగన్ ది ముక్కుసూటితనం. ఆయన తాను నమ్మినది చేస్తారు. అది రాజకీయాల్లో ఎక్కువ సార్లు సరిపడదు, కానీ జగన్ మాత్రం అదే తన మార్గం అంటూ ముందుకు సాగుతున్నారు. అందుకే ఆయన రాజకీయ నాయకులకు కొత్తగా కనిపిస్తున్నారు. జగన్ లాంటి వారిని ఎపుడూ చూడలేదని చంద్రబాబు విమర్శనాత్మకంగా అన్నా అలాంటి పట్టుదల కలిగిన నేత కూడా కావాల్సిన అవసరం ఉందని అనే వారూ ఉన్నారు. వైసీపీ వారు అయితే జగన్ దే కరెక్ట్ అని కూడా అంటారు. కానీ సగటు రాజకీయ నేతలకు జగన్ ఒక ప్రత్యేకమైన వ్యక్తిగానే ఉంటారు. విపక్షాలు అది ఒప్పుకోలేక సైకో అని అంటాయి. తాను జగన్ ని సైకో అని ముద్దుగా పిలుస్తాను అని చంద్రబాబు అంటున్నారు. రాజకీయంగా జగన్ రూట్ అది. ఆయన పంథా నయా ట్రెండ్. బాబు ఎర్లీ సెవెంటీస్ పాలిటిక్స్ ని చూస్తూ వస్తున్నారు. ఇపుడు తరం జగన్ వైఖరిని ఇష్టపడుతున్నారు అన్నది వైసీపీ నేతలు చెప్పే మాట. బాబు జగన్ లాంటి వారిని చూడలేదు అంటే అది ఆయనకు జగన్ కి ఉన్న జనరేషన్ గ్యాప్ అని కూడా అంటున్నారు.

జగన్ కోణం జనం కోణమని సైకో అన్నది విపక్షం ఎలా పిలిచినా జనం మెప్పుదలే జగన్ కి కొలమానం అని వైసీపీ నేతలు చెబుతారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

**రాహుల్ గాంధీ సభను విజయవంతం చేయండి :**

**ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**





**ఖానాపూర్ మే 3(ప్రభాత సమాచారం )**

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం ఖానాపూర్ మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెడ్పిటిసి,మాజీ ఉపసర్పంచ్ తో పాటు వందల మంది బిఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయ్యారు. అదే విధంగా తర్లపాడు,సత్తన్ పల్లి సేవ నాయక్ తండా,గ్రామాలకు చెందిన 400 వందలకు పైగా గ్రామస్తులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికీ పార్టీ కండువా కప్పి పార్టీలో సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రతిష్టాత్మకమైన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వందల సంఖ్యలో బీజేపి,బిఆర్ఎస్ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. ప్రతి పెద వాడికి అండగా ఉండే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని పేర్కొన్నారు. దేశానికి రాహుల్ గాంధీ నాయకత్వం ఎంతో అవసరమని, ఆయనను ప్రధానిని చేయడమే మన లక్ష్యం కావాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో హస్తం గుర్తుకు ఓటేసి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. **రాహుల్ గాంధీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయండి**ఈనెల 5న నిర్మల్ జిల్లా కేంద్రంలో ఎన్నికల నైపథ్యంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో తలపెట్టిన రాహుల్ గాంధీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఈ సభకు జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు, కార్మికులు,కర్షకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ సభను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సర్కారి దావఖానలో తండ్రికి శస్త్ర చికిత్స చేయించిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్





**ఆదిలాబాద్ మే 3(ప్రభాత సమాచారం)**

'నేను రాను బిడ్డో సర్కారు దావఖానకు' అనేది ఒకప్పటి మాట..కానీ సర్కారి దావఖానేలే పేదలకు నాన్యమైన వైద్యం అందిస్తాయని ప్రజల్లో నమ్మకం కలిగించి ప్రజల దృష్టిని సర్కారు దావఖానాల వైపు మల్లించడంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ ముందు వరుసలో ఉన్నారు. తనకు జబ్బు చేస్తే స్వయంగా సర్కారు దావఖానకు వెళ్లి వైద్యం చేయించుకొనే ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ తన తండ్రిని కూడ సర్కారు ఆస్పత్రిలో చేర్పించి తన నిబద్దతను చాటుకొన్నారు. వెడ్మ భోజ్జు గారి తండ్రి వెడ్మ భీంరావు దవడ కు క్యాన్సర్ అయింది. ఈ విషయం తెలుసుకొన్న అయన ధైర్యంగా తన తండ్రిని ఆదిలాబాద్ లోని రిమ్స్ సూపర్ స్పెషలిటీ ఆస్పత్రిలో చేర్పించారు.క్యాన్సర్ డాక్టర్ జకుల శ్రీకాంత్,రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ లతో మాట్లాడి డాక్టర్లు ఇచ్చిన ధైర్యంతో అక్కడే శాస్త్ర చికిత్స చేయించారు. అంకలాజి డాక్టర్లు విజయవంతంగా ఆపరేషన్ చేసారు. ఎమ్మెల్యే గారి తండ్రి ప్రస్తుతం కోలుకొంటున్నారు. శుక్రవారం ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు గారు ఆస్పత్రికి వెళ్లి తండ్రిని పరమార్శించి సపర్యలు చేసారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ సర్కారు ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం కలిగించేందుకు తన తండ్రికి సర్కారు ఆస్పత్రిలో శాస్త్ర చికిత్స చేయించానని అన్నారు. చిన్న చిన్న రోగాలకు చికిత్స కోసం కార్పొరేట్ అస్పత్రులకు వెళ్లి ఆర్థిక సమస్యలు తెచ్చుకోవద్దని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రులను ఆధునికరించి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్య సదుపాయాలు కల్పిస్తుందని అన్నారు.

# కలిసి కట్టుగా పని చేసి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిద్దాం

**ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**



**ఉట్నూర్ మే 3(ప్రభాత సమాచారం )**

కలిసి కట్టుగా పని చేసి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిద్దామని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు.శుక్రవారం ఉట్నూర్ మండలంలోని ఎమ్మెల్యే నివాసంలో వడోని గ్రామానికి చెందిన యువకులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే వారికీ కండువా కప్పి పార్టీలో సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.10 ఏళ్ళ బీజేపీ, బిఆర్ఎస్ పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 3 నెలల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం కింద 200యూనిట్ల ఉచిత కరెంటు, ఆరోగ్య శ్రీ పథకం కింద 10 లక్షల భీమా,లాంటి ప్రతిష్టాత్మకమైన సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదని అన్నారు. పేదల బ్రతుకులు మారాలంటే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావాలని అన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే దేశంలో సూ పరిపాలన అందిస్తారన్నారు.రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటేసి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# కేసీఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయం.. బాంబ్ పేల్చిన లక్ష్మణ్

హైదరాబాద్, మే 3: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయమంటూ బాంబ్ పేల్చారు. హైదరాబాద్‌ను యూటీ చేయాలని కేటీఆర్ కలలు కంటున్నారంటూ విమర్శలు గుప్పించారు. శుక్రవారం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీనే రిజర్వేషన్లకు వ్యతిరేకమని అన్నారు. వెనుకబడిన వర్గాల వారికి రిజర్వేషన్లు ఇవ్వాలని అంబేద్కర్ చెప్తే.. ముస్లిం రిజర్వేషన్లను తెరపైకి తెచ్చారన్నారు.

రిజర్వేషన్ల గురించి మాట్లాడితే కాంగ్రెస్ అంబేద్కర్‌ను అవమానించిందని విమర్శించారు. కులాల పేరు మీద రిజర్వేషన్లు వద్దనేది రాజీవ్ గాంధీ వాదనన్నారు. రేవంత్ రెడ్డి ది కాంగ్రెస్ బ్లడ్ కాదని.. రేవంత్ కాంగ్రెస్ నేతలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ముస్లింలకు రిజర్వేషన్‌లను హైకోర్టు కొట్టివేస్తే.. సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారన్నారు. కేసీఆర్ గతంలో ముస్లింలకు 12శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని చెప్పారని గుర్తుచేశారు. కేసీఆర్‌కు ఎలాంటి గతి పట్టిందో అదే గతి రేవంత్ రెడ్డికి పడుతుందని వ్యాఖ్యలు చేశారు. మోదీ మూడోసారి ప్రధాని అవుతారని రేవంత్ రెడ్డి ఓర్వలేకపోతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ గాడిద గుడ్డు కాదు... పాము గుడ్డు గుర్తు కాంగ్రెస్‌కు ఇచ్చి ఎన్నికల్లో పోటీ చేయించాలంటూ సెటైర్ విసిరారు. ప్రధాని మోదీ గురించి మాట్లాడేందుకు కేటీఆర్‌కు సిగ్గు ఉండాలన్నారు. ఎన్నికల్లో గెలవమన్న భయంతోనే సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ పోటీ చేయడం లేదని ఎంపీ లక్ష్మణ్ వ్యాఖ్యలు చేశారు.

# మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో భారీగా బిఆర్ఎస్ నాయకుల చేరికలు





**నిర్మల్ మే 3(ప్రభాత సమాచారం):**

నిర్మల్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు పంచాయతీ రాజ్, శిశు సంక్షేమ శాఖ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క సమక్షంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి సీతక్క వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ... యువత ఎక్కువ మంది కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను చూసి ఆకర్షితులై పార్టీలోకు చేరుతున్నారని అన్నారు. పార్టీలో చేరిన కార్యకర్తలందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్,నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షుడు శ్రీహరిరావ్, మాజీ ఎంపీ వేణుగోపాల్ చారి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# రాహుల్ గాంధీ సభ స్థలాన్ని పరిశీలించిన మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



**నిర్మల్ మే 3(ప్రభాత సమాచారం )**

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 5న నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాహుల్ గాంధీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పంచాయతీ రాజ్, శిశు సంక్షేమ శాఖ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం రాహుల్ గాంధీ సభా ఏర్పాట్లను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేస్తూ సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, జిల్లా అధ్యక్షుడు శ్రీహరి రావు, మాజీ ఎంపీ వేణుగోపాల్ చారి, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించండి

**ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**



**ఖానాపూర్ మే 3(ప్రభాత సమాచారం)**

సబ్బండ వర్గాల అభ్యున్నతికి కృషి చేసే ఎకైక పార్టీ కాంగ్రెస్ అని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఖానాపూర్ పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. నిరంతరం ప్రజల హితాన్ని కోరే ఆత్రం సుగుణకు రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇచ్చి చట్టసభల్లో పంపించాలన్నారు.ఈ ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేస్తుందని అన్నారు.అనంతరం పెద్ద ఎత్తున కాలనీ వాసులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికీ కండువా కప్పి పార్టీలో సాధారంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ సవాల్‌ను స్వీకరిస్తున్నా.. రాజీనామాకు సిద్ధం

సిద్దిపేట : సీఎం రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మరోసారి స్పష్టం చేశారు. పంద్రాగస్టు లోగా ఆరు గ్యారెంటీలు, రూ. 2 లక్షల రుణమాఫీ అమలు చేస్తే.. రాజీనామా చేస్తానని ఆయన తేల్చిచెప్పారు. సిద్దిపేటలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ బాండ్ పేపర్ బౌన్స్ అయిందన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేస్తారా..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.ప్రెస్ అకాడమీ చైర్మన్ వద్ద ఇద్దరి రాజీనామాలు ఉంచుదాం. రేవంత్ రెడ్డి రాజీనామా లేఖ ఇచ్చిన 10 నిమిషాల్లోనే తన రాజీనామా లేఖ పంపిస్తాను. స్పీకర్ ఫార్మాట్‌లోనే రాజీనామా లేఖ అందజేస్తాను. పంద్రాగస్టు లోగా ఆరు గ్యారెంటీలు, రుణమాఫీ చేస్తే రాజీనామా ఆమోదించుకుంటాను. ఆ తర్వాత సిద్దిపేటకు రేవంత్ రెడ్డిని పిలిపించి శాలువాతో సన్మానం చేస్తానని పేర్కొన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. ఆ గడువు దాటిపోయినా పత్తా లేదన్నారు. ఇప్పుడేమో పంద్రాగస్టు లోగా చేస్తామని చెబుతున్నారు.

పదవుల కోసం చిల్లర రాజకీయాలు చేయడం తనకు అలవాటు లేదన్నారు. రాష్ట్రాన్ని తెచ్చింది సిద్దిపేటనే.. తెలంగాణ రావడానికి కేసీఆరే కారణం. తెలంగాణకు, కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి రుణపడి ఉండాలన్నారు. రాష్టంలో అభివృద్ధి జరగలేదని రేవంత్ రెడ్డి చెప్పడం పచ్చి అబద్ధం.. ఇది ప్రజలందరికీ తెలుసు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# పట్టు నిలపాలని.. పాగా వేయాలని..

వికారాబాద్ : పార్లమెంటు ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్, భారాస, భాజపాలు సమరానికి సన్నద్ధమవుతున్నాయి. 2008లో నూతనంగా ఏర్పడిన చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో రెండుసార్లు వరుస విజయాలు సాధించిన భారాస మరో విజయంతో హ్యాట్రిక్ సాధించాలని ఉవ్విళ్లూరుతోంది. కాంగ్రెస్ రెండో గెలుపు నమోదు చేసి పట్టు సాధించాలని తహతహలాడుతోంది. ప్రధాని మోదీ చరిష్మాను నమ్ముకున్న భాజపా ప్రత్యేక వ్యూహంతో ఎన్నికల సమరంలో ముందుకెళ్తోంది.

తొలి గెలుపు సాధనకు భాజపా కసరత్తు

తొలి విజయం కోసం కమలదళం కసరత్తు చేస్తోంది. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆ పార్టీని వీడి భాజపాలో చేరి తమ పార్టీ శ్రేణులను సన్నద్ధం చేస్తున్నారు. తొలి విజయం కోసం శ్రమిస్తున్నారు.

హ్యాట్రిక్ కోసం భారాస..

చేవెళ్లలో వరుసగా మూడో విజయం సాధించి హ్యాట్రిక్ సాధించాలని భారాస ప్రణాళికలు రచిస్తోంది. 2014లో భారాస అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, 2019లో గడ్డం రంజిత్‌రెడ్డిలు విజయం సాధించారు. శాసనసభ ఎన్నికల అనంతరం మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో సిట్టింగ్ ఎంపీ కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ తరపున పోటీ



చేస్తుండగా, తెదేపా రాష్ట్ర అధ్యక్ష పదవికి రాజీనామా సమర్పించి భారాసలో చేరిన కాసాని జ్ఞానేశ్వర్‌ను బరిలో దించింది. గత శాసనసభ ఎన్నికల్లో భారాసకు ఏడు నియోజకవర్గాల్లో కలిపి కాంగ్రెస్ కంటే 65,600 ఓట్లు అధికంగా వచ్చాయి. ఈసారికూడా గెలుస్తామని ఆశిస్తున్నారు.

కార్యకర్తలను సమాయత్తం చేస్తూ..

భారాస నుంచి సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి పార్టీ మారి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలువగా, భారాస కాసాని జ్ఞానేశ్వర్‌ను, భాజపా కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలను తమ అభ్యర్థులుగా ప్రకటించాయి. లోక్‌సభ నియోజకవర్గానికి కాంగ్రెస్ ఇంఛార్జిగా వేంనరేందర్‌రెడ్డి, భారాస ఇంఛార్జిగా మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డిని నియమించగా, భాజపా ఇంకా నియమించలేదు. ప్రస్తుతం మూడు పార్టీలు నియోజకవర్గ, మండల స్థాయిల్లో కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నాయి.

రెండో గెలుపుపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి

చేవెళ్లలో రెండో విజయంపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. 2009లో గెలిచిన ఆ పార్టీ 2014, 2019లో జరిగిన ఎన్నికల్లో ఓడిపోయింది. ప్రస్తుతం చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో జిల్లాలోని వికారాబాద్, తాండూర్, పరిగి శాసనసభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. మిగతా నాలుగు నియోజకవర్గాల్లో భారాస ఎమ్మెల్యేలు ఉన్నారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటం, ఇతర పార్టీల నుంచి నాయకులు చేరడంతో కొంత బలం పుంజుకుంది.

# హైదర్‌నగర్ భూముల పరిరక్షణకు సిద్ధం

హైదరాబాద్ :మియాపూర్ సమీపంలోని హైదర్‌నగర్‌లో ప్రభుత్వ అధీనంలోకి వచ్చిన భూములను పరిరక్షించేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారు. సర్వే నంబర్ 172లోని 196 ఎకరాల్లో 185 ఎకరాలను ప్రభుత్వపరం చేసుకునేందుకు రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారులు న్యాయనిపుణులతో చర్చించారు. అంతకుముందు హైదర్‌నగర్ భూములు తమవేనంటూ దుర్గామాత హౌస్ బిల్డింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ, ట్రినిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్, ఇతర కంపెనీలు సుప్రీంకోర్టులో మూడేళ్ల క్రితం వేర్వేరుగా స్పెషల్ లీవ్ పిటీషన్లు దాఖలు చేశారు. ఈ భూములు ప్రభుత్వానివేనంటూ రెవెన్యూ అధికారులు పిటిషన్ వేశారు. వాటిలో కేవలం 11 ఎకరాల భూమి 1948 సంవత్సరానికి ముందు జాగిర్‌దారుల వద్ద కొన్న పట్టాదారులకు



చెందుతుందని సుప్రీంకోర్టు ప్రకటించింది. ఈ తీర్పుపై అప్పీలు చేయడానికి వీల్లేకుండా ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు హైదర్‌నగర్ భూముల అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపట్టనున్నామని కూకట్‌పల్లి తహసీల్దార్ స్వామి తెలిపారు.

విలువ రూ.7 వేల కోట్లు

ఆరు దశాబ్దాలకు పైగా వివాదాల్లో నలిగిన ఆ భూముల విలువ ప్రస్తుతం రూ.7 వేల కోట్లు ఉంటుంది. జాతీయ రహదారికి అనుకుని ఉండడం, స్థిరాస్తి వెంచర్లు, ఐటీ సంస్థలు సమీపంలో ఉండడంతో వీటి విలువ 15ఏళ్లలో కొన్నిరెట్లు పెరిగింది. వీటిని సొంతం చేసుకునేందుకు కొందరు ప్రైవేటు వ్యక్తులు, రాజకీయ నాయకులు ప్రయత్నాలు చేశారు. పైగా వారసులతోపాటు నిజాం వారసులు, జాగిర్దార్‌ల నుంచి కొన్నామంటూ వాదించారు. 1956లో నాంపల్లి కోర్టులో సివిల్ సూట్ వేశారు. భూముల విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో నాంపల్లి కోర్టు సివిల్ సూట్‌ను హైకోర్టుకు బదిలీ చేసింది. హైకోర్టు ఈ వ్యాజ్యాన్ని విచారించి పైగా వంశస్తులకు అనుకూలంగా ప్రిలిమినరీ డిక్రీని 1963లో జారీ చేసింది. తుది తీర్పు రాకుండానే.. పైగా వంశస్తుల నుంచి కొన్ని సంస్థలు, హౌసింగ్ సొసైటీలు కొనుగోలు చేశాయి. ఈ ఉత్తర్వులపై ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయగా అప్పటి నుంచి వ్యాజ్యాలు కొనసాగుతున్నాయి. ఈ భూములు ప్రైవేటు సంస్థలు, పైగా వారసులకు చెందినవి కావని, ప్రభుత్వానివే కావంటూ హైకోర్టు నాలుగేళ్ల క్రితం ఉత్వర్వులు జారీచేసింది.

# కన్నడిగులపై కన్ను



హైదరాబాద్ : నగరంలోని కన్నడిగులను ఆకట్టుకోవడానికి కాంగ్రెస్ పార్టీ కార్యాచరణ మొదలుపెట్టింది. అక్కడి నేతలను రంగంలోకి దించడానికి కసరత్తు చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే ఇప్పుడూ ప్రచారం చేయాలని కర్ణాటక నేతలను టీపీసీసీ నాయకులు కోరుతున్నారు. నవంబరులో జరిగిన ఎన్నికల సందర్భంగా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సహా మంత్రులు బోసురాజు, సుధాకర్, ప్రియాంక్ ఖర్గే, రామలింగారెడ్డి, జమీర్ అహ్మద్‌లు గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ప్రచారం చేశారు. ఆ రాష్ట్రంలో 14 లోక్‌సభ స్థానాలకు శుక్రవారం పోలింగ్ ముగియడం, మళ్లీ మే7న పోలింగ్ ఉండడంతో పది రోజుల వ్యవధిలో రెండు, మూడు రోజులు వారితో ప్రచారం చేయించాలని నిర్ణయించారు. సిద్ధరామయ్య, ముగ్గురు మంత్రులు హైదరాబాద్‌కు వచ్చేందుకు అంగీకరించారు. చేవెళ్ల, మల్కాజిగిరి లోక్‌సభ నియోజవర్గాల్లో వీరు పర్యటించి సభలు, సమావేశాలు నిర్వహించనున్నారు.

సమావేశాలతో ఆకర్షణ మంత్రం..

కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థులను గెలిపించేందుకు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, ఇతర మంత్రులు ఇక్కడికి వచ్చేముందు ప్రత్యేక ప్రణాళికలతో వస్తున్నారు. చేవెళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాద్ లోక్‌సభ నియోజవర్గాల్లో నివసిస్తున్న కన్నడిగుల వివరాలు తెలుసుకుని వారితో ఆత్మీయ సమావేశాలు నిర్వహించనున్నారు. సికింద్రాబాద్, కాచిగూడ, ఖైరతాబాద్, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, చేవెళ్ల, ఎల్బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్లలోని కన్నడ సంఘాల ప్రతినిధులతో మాట్లాడనున్నారు. కాచిగూడ, మలక్‌పేటలో ఉంటున్న కన్నడ సంఘాలతో ఇప్పటికే ఇద్దరు మంత్రులు చర్చించారు.

స్థానిక అంశాలు.. గ్యారెంటీలు

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేసేందుకు వస్తున్న నేతలను స్థానిక అంశాలు, ఆరు గ్యారెంటీలను సభల్లో ప్రస్తావించాల్సిందిగా రాష్ట్ర నాయకులు సూచించారు. కర్ణాటకలో అమలు చేస్తున్న గ్యారెంటీలతో ప్రజల జీవన విధానంలో వచ్చిన మార్పులను ఇక్కడి వారికి వివరించాల్సిందిగా కోరారు. మహిళలు, యువతులు, ఐటీ ఉద్యోగినులకు ఉచిత బస్సు ప్రయాణంతో జరుగుతున్న మేలు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తుతో పొందుతున్న లబ్ధిపై ప్రచారం చేయనున్నారు.

# పరిధి దాటింది.. బిల్లు వచ్చింది



కామారెడ్డి : ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద తెల్లరేషన్‌కార్డులు కలిగిన లబ్ధిదారులకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తోంది. వీరికి శూన్య బిల్లులు అందజేస్తున్నారు. ఉష్ణోగ్రతలు 44-45 డిగ్రీలకు చేరడంతో ప్రజలు ఉక్కపోతలతో అల్లాడుతున్నారు. గృహాల్లో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు నిరంతరాయంగా నడుస్తున్నాయి. దీంతో చాలా మంది వినియోగదారులు 200 యూనిట్ల పరిధి దాటుతున్నారు. దీంతో వారు బిల్లుల చెల్లింపు పరిధిలోకి వస్తున్నారు. మార్చి నెలతో పోలిస్తే ఏప్రిల్‌కు వచ్చేసరికి 4,516 మంది వినియోగదారులు పరిధి దాటడంతో బిల్లులు వచ్చాయి. ఒకవేళ వీరు మళ్లీ 200 యూనిట్లలోపు వాడుకుంటే మళ్లీ శూన్య బిల్లులు వస్తాయి.

గృహావసరాలకే డిమాండ్..

జిల్లావ్యాప్తంగా వ్యవసాయ సీజన్ తగ్గింది. వరికోతలు పూర్తికావడంతో రైతులు బోరుబావులకు విశ్రాంతి ఇచ్చారు. కాని గృహావసరాలకే విద్యుత్తు డిమాండ్ అధికంగా పెరిగింది. ప్రస్తుతం జిల్లాకు నిత్యం 4.65 మిలియన్ యూనిట్లు కోటా కేటాయించారు. ఇందులో సరాసరిగా 2.22 మిలియన్ యూనిట్లను వినియోగిస్తున్నారు. అందులో వాణిజ్య, పరిశ్రమల అవసరాలు పోను మిగతా విద్యుత్తును గృహావసరాలకే వినియోగిస్తున్నారు. మేలో గృహావసరాల డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉంది. జూన్ 15వ తేదీ వరకు ఇదే పరిస్థితి కనిపిస్తుంది. మొత్తం మీద గృహజ్యోతి వినియోగదారుల సంఖ్య తగ్గుతుంది.

ఎలక్ట్రానిక్ వస్తువులకు గిరాకీ..

ఉక్కపోతలు, ఎండలతీవ్రత కారణంగా వినియోగదారులు ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. విద్యుత్తు ఉచితంగా సరఫరా చేస్తుండడంతో చాలా మంది వినియోగదారులు ఫ్యాన్లు, కూలర్లు కొనుగోలు చేస్తున్నారు. మరికొందరు ఏసీలు కొనుగోలుకు ఇష్టపడుతున్నారు. ఒక్క నిమిషం విద్యుత్తు సరఫరాకు ఆటంకం కలిగినా ఫ్యాన్లు, కూలర్లు నడవక వినియోగదారులకు ఇబ్బంది కలుగుతోంది. దీంతో విద్యుత్తు వినియోగం ఒక్క సారిగా పెరిగింది.

# ఏసీబీ, విజిలెన్స్ అధికారుల విస్తృత తనిఖీలు.. స్థిరాస్తి వ్యాపారుల్లో గుబులు!



ఆసిఫాబాద్ : సర్కారీ స్థలాల కబ్జా, అక్రమ వెంచర్లతో చెలరేగుతున్న భూ మాఫియా వ్యక్తుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఏకకాలంలో విజిలెన్స్, ఏసీబీ అధికారుల తనిఖీలతో వీరు ఠారెత్తిపోతున్నారు. ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నారు. ఇన్నాళ్లూ అధికారులు, నేతల అండదండలతో ఏం చేసినా నడుస్తుందనే ధీమాతో ఉన్న వీరు.. తాజాగా పరిస్థితులు మారడంతో కొందరు నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో తలమునకలయ్యారు. నిబంధనలకు విరుద్ధంగా.. భూ క్రయ విక్రయాలతో రూ.కోట్లు దండుకున్న ఈ ముఠా సభ్యులపై విచారణ సజావుగా సాగుతుందా, అక్రమాలపై కఠిన చర్యలు ఉంటాయా అనే విషయాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. మాజీ సర్పంచి, ఇద్దరు మైనారిటీ నేతలు, మరో ఇద్దరు కీలక నాయకులు కలిసి బృందంగా ఏర్పడ్డారు. బీడీపీపీ భూములు, ఆబాదీ భూములను పట్టాదారుల నుంచి కారుచౌకగా కొనుగోలు చేశారు. కొన్నిచోట్ల పడావుగా ఉన్న వాటిని మైదానాలుగా మార్చి ప్లాట్లు విక్రయించేస్తున్నారు. ఈ తరుణంలో అధికారులందరికీ చేతులు తడిపి, తమ పని కానిచ్చేశారు. ఈ అక్రమాలను 'ఈనాడు' వరుస కథనాలతో బహిర్గతం చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే విజిలెన్స్ అధికారుల విచారణ కొనసాగుతోంది. సదరు భూబకాసురులు తమ కార్యకలాపాలను వాంకిడికి సైతం విస్తరించారు. రెండు రోజుల కిందట విజిలెన్స్ అధికారులు వాంకిడి మండలంలో వీరు చేసిన భూ అక్రమాల వివరాలను రెవెన్యూ కార్యాలయం నుంచి తీసుకున్నారని సమాచారం.

కొనసాగుతున్న విచారణ...

నాలుగు వరుసల రహదారి పరిహారం విషయంలో జరిగిన అక్రమ చెల్లింపులపై ఇప్పటికే ఏసీబీ అధికారుల విచారణ కొనసాగుతోంది. అయాచితంగా లబ్ధిపొందిన వ్యక్తులు, తమకు సహకరించిన రెవెన్యూ అధికారుల ఖాతాల్లో రూ.కోటి వరకు జమ చేసిన విషయం విదితమే. రెబ్బెన, ఆసిఫాబాద్, వాంకిడి మండలాల్లో ఇప్పటి వరకు భూములు కోల్పోయిన వారికి రూ.70 కోట్లు పరిహారంగా ఇచ్చారు. ఆసిఫాబాద్‌లో రూ.4 కోట్ల పరిహారం కుంభకోణం ఉండగా.. మిగతా చోట్ల సైతం చెల్లింపుల్లో అనేక అవకతకవలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు పూర్తి పరిహారం చెల్లింపుపై సమగ్ర విచారణ చేస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

భూ సమస్యను ఆర్డీఓ కార్యాలయంలో 60:40 శాతంగా ఎలా పరిష్కరిస్తారు? మిగతా భూములను ఎందుకు సర్వే చేసి, పొజిషన్ రైతులకు చూపించలేదు. కేవలం రహదారుల పక్కనే ఉన్న భూములను మాత్రమే తీసుకుని, పట్టా పాస్ పుస్తకాలు ఎలా జారీ చేస్తారు (ఇటీవల పట్టాలు ఇతరుల పేరు మీద వచ్చాయి). వెంచర్‌కు అనుమతులు ఉన్నాయా, తదితర విషయాలను విజిలెన్స్ అధికారులు సేకరిస్తున్నారు. వాంకిడిలో ఏం జరిగింది...నిజాం కాలంలో వాంకిడి (కలామ్) కు చెందిన లతీఫొద్దీన్‌కు 12 వివిధ సర్వే నంబర్లలో 104 ఎకరాల భూమి ఉండేది. కాలక్రమేణా ఆయన ఇతర దేశాల్లో స్థిరపడి అక్కడే మృతి చెందారు. ఈ భూములను తాతల కాలం నుంచి స్థానిక రైతులు సాగు చేసుకుంటున్నారు. భూములన్నీ పట్టేదార్ పేరుమీద ఉండడంతో.. వారి వారసులను స్థిరాస్తి వ్యాపారి, మరో ఇద్దరు రంగంలోకి దించారు. ఆసిఫాబాద్ ఆర్డీఓ వద్దకు ఈ సమస్య వెళ్లగా.. ఆయన 60:40 యజమానులు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

# వారు కట్టేస్తున్నారు.. వీరు కళ్లు మూసుకున్నారు

హైదరాబాద్ : శంషాబాద్ విమానాశ్రయం రన్‌వే సమీపంలో అసైన్డ్ భూములపై కొందరు అక్రమార్కులు కన్నేశారు. ఈ భూముల్లో లబ్ధిదారులు వ్యవసాయం చేయకపోవడంతో.. వాటిని సొంతం చేసుకుని పక్కా ఇళ్లు నిర్మిస్తున్నారు. మున్సిపాలిటీలు, పంచాయతీల్లో ఇళ్ల నిర్మాణాలకు అధికారిక అనుమతులున్నట్లు లే-అవుట్ల తరహాలో వీటిని కడుతున్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూలు ప్రారంభమైన రెండు, మూడు రోజుల నుంచి జోరుగా నిర్మాణాలు సాగుతున్నా అధికారులు మిన్నకుండిపోయారు. శంషాబాద్-కోళ్లపడకల్ -తుక్కుగూడ ప్రధాన రహదారికి కిలోమీటర్ దూరంలోని అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు కొనసాగుతున్నా రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు.

నోటరీ ధైర్యంతో విక్రయాలు...

అసైన్డ్ భూముల్లో ఇళ్లు నిర్మిస్తున్న కబ్జాదారులు వాటిని విక్రయించేందుకు జీవో నంబర్ 111ను తెలివిగా వాడుకుంటున్నారు. జీవో పరిధిలో భూములకు రిజిస్ట్రేషన్ చేసేందుకు అవకాశాలు లేవని,



నోటరీ పేరుతో రిజిస్ట్రేషన్లు చేయిస్తామని చెబుతున్నారు. విమానాశ్రయం రన్‌వేకు దగ్గరగా ఉండడంతో సంపన్నులు ఈ ఇళ్లను కొనేందుకు ముందుకు వస్తున్నారు. సుమారు యాభైమంది సంపన్నులు ఒక్కొక్కరూ రెండు, మూడు ఇళ్ల చొప్పున కొనుగోలు చేశారు. మరింత మంది ముందుకు వస్తుండడంతో కబ్జాదారులు అసైన్డ్ భూములను ఆక్రమించుకుంటూ ముందుకెళ్తున్నారు. అక్కడ రైతులుంటే భూములు అమ్మాలంటూ వారిపై ఒత్తిళ్లు తీసుకువస్తున్నారు. వారి నుంచి రూ.లక్షల్లో కొని.. ఇళ్లు నిర్మించి రూ.కోట్లల్లో విక్రయిస్తున్నారు.

చుట్టూ పచ్చదనం.. ఫామ్‌హౌస్‌లు.. రిసార్ట్‌లు..

శంషాబాద్, చిన్నగోల్కొండ, పెద్దగోల్కొండ, గొల్లపల్లి, బహదూర్‌గూడ, తుక్కుగూడ ప్రాంతాల్లో చుట్టూ పచ్చదనం ఉండడంతో సంపన్నులు అక్కడ ఫామ్‌హౌస్‌లు నిర్మించుకున్నారు. ఒకటి, రెండేళ్ల నుంచి రిసార్ట్‌లు వెలుస్తున్నాయి. ఇక్కడే ప్రభుత్వ, అసైన్డ్ భూములుండడంతో కొందరు ప్రజాప్రతినిధులు, అక్రమార్కులతో కలిసి వాటిని సొంతం చేసుకోవాలని చూసున్నారు. ఇందులో భాగంగా సయ్యద్‌గూడలోని 200 ఎకరాల అసైన్డ్ భూములను ఎంచుకున్నారు. పంటలు పండని ప్రాంతాల్లో సరిహద్దు రాళ్లు పాతి కంచెలు వేసి.. ఇళ్లు నిర్మిస్తున్నారు. గతేడాది రెవెన్యూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్రమార్కులు కొద్దిరోజులు నిర్మాణాలను నిలిపేశారు. గత నెల ప్రారంభం నుంచి మళ్లీ ఇళ్లు కడుతున్నారు. ఈసారి అక్రమార్కులపై అధికారులు ఫిర్యాదు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

# తవ్వడంలో ఉత్సాహం.. తారు వేయడంలో తాత్సారం

తాండూరు : రెండుమూడు కిలోమీటర్లు తవ్వకాలు చేపట్టి వెంటనే కంకర, తారు పనులు పూర్తి చేస్తే సౌకర్యంగా ఉంటుంది, అలా కాకుండా జాతీయ రహదారుల విభాగం అధికారులు ఒకేసారి 40 కిలోమీటర్లు తవ్వేయించి తారు పనులు 'నత్తనడకన నయం' అన్నట్లుగా చేయిస్తున్నారు. దీంతో నెలల తరబడి అవస్థలకు గురిచేస్తున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే తారు పనులు చేపట్టి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నారు. సక్రమంగా సాగని జాతీయ రహదారి పనులతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. రెండేళ్లుగా గుంతలు పడి దెబ్బతిన్న రహదారికి ఇరువైపులా తవ్వకాలు చేపట్టారు. 40 కి.మీ.వరకు దారిపొడవునా నాలుగు అడుగుల లోతున తవ్వేశారు. కంకర, తారు పనులు చేపడితే రాకపోకలకు సౌకర్యంగా మారుతుంది. కానీ అధికారుల అలసత్వం, గుత్తేదారు నిర్లక్ష్యంతో తారు పనులు నెలల తరబడి జాప్యం చేస్తున్నారు. వెరసి నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగించే 6వేలకుపైగా వాహనదారులు లక్ష మందికిపైగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి సంబంధించి కథనం. ఏడాదిన్నర క్రితం నాలుగు వరుసలకు శ్రీకారం: ఏడాదిన్నర క్రితం కేంద్ర ప్రభుత్వం తాండూరు మండలం మీదుగా కర్ణాటక రాష్ట్రం మన్నెకెల్లి నుంచి మహబూబ్‌నగర్ జిల్లా బూత్‌వరకు జాతీయ రహదారిగా ప్రకటించింది. నాలుగు వరసల రహదారి నిర్మించేందుకు రూ.682కోట్లు మంజూరు చేసింది. వాటితో పనులు చేపట్టిన గుత్తేదారు



కొడంగల్ నుంచి తాండూరు మండలం కొత్లాపూర్ వరకు 40 కిలోమీటర్లు రహదారికి ఇరువైపులా తవ్వేశారు. రాత్రివేళ గుంతలోకి వాహనాలు దూసుకెళ్లి ప్రమాదాలు జరగకుండా వాహనదారుల్ని అప్రమత్తం చేసేందుకు సూచిక బోర్డులు అమర్చలేదు. సిమెంటు బస్తాల్లో కర్రలు పాతి సన్నని దారం కట్టి చేతులు దులిపేసుకున్నారు.

పెద్ద ఎత్తున దుమ్ములేస్తోంది

రహదారి మార్గంలో గుంతల్లో ఎర్రమట్టి, రహదారి వారగా నాపరాయి వ్యర్థాలు, సుద్ద కుమ్మరించడంతో వాహనాల రాకపోకల సమయంలో పెద్దఎత్తున దుమ్ము లేస్తోంది. వాహనాలు కన్పించనంతగా వెలువడుతున్న దుమ్ముతో వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు జంకుతున్నారు. దుమ్ము లేవకుండా ట్యాంకర్ల ద్వారా నీరు పోయాల్సి ఉన్నప్పటికీ గుత్తేదారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దుమ్ము కారణంగా శ్వాసకోశ, ఊపిరితిత్తులు, చర్మ వ్యాధుల బారిన పడే ప్రమాదముందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.



# 25 ఏళ్లలో తొలిసారి.. అమేఠీని వదులుకున్న గాంధీలు

అమేఠీ .. ఐదేళ్ల క్రితం వరకు గాంధీ కుటుంబానికి ఇది పెట్టని కోట. 2019లో కమలదళ దండయాత్రలో ఈ సామ్రాజ్యాన్ని కోల్పోవాల్సి వచ్చింది. దీంతో తాజా ఎన్నికల్లో దీన్ని తిరిగి దక్కించుకునే బాధ్యతను.. కాంగ్రెస్ అధిష్ఠానం గాంధీల నమ్మకస్థుడైన కిశోరీ లాల్ భుజానెత్తింది. అలా పాతికేళ్ల తర్వాత తొలిసారి గాంధీ కుటుంబేతర వ్యక్తి ఇక్కడ పోటీకి దిగినట్లయ్యింది.

**గాంధీ కుటుంబానికి ప్రతిష్ఠాత్మకం..** గత నాలుగున్నర దశాబ్దాల్లో దాదాపు 31 ఏళ్లు అమేఠీ లోక్‌సభ నియోజకవర్గానికి గాంధీ కుటుంబసభ్యులు ప్రాతినిధ్యం వహించారు. 1980లో తొలిసారి సంజయ్ గాంధీ ఇక్కడి నుంచి గెలుపొందారు. ఆయన ఆకస్మిక మరణంతో మరుసటి ఏడాది జరిగిన ఉప ఎన్నికల్లో రాజీవ్ గాంధీ బరిలోకి దిగారు. అప్పటి నుంచి 1991 వరకు ఆయనే ఎంపీగా కొనసాగారు. ఇక, 1999లో సోనియా గాంధీ పోటీ చేయగా.. ఆ తర్వాత జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అమేఠీని కుమారుడికి అప్పగించారు. అలా 2004 నుంచి రాహుల్ గాంధీ వరుసగా మూడు సార్లు ఇక్కడ విజయం సాధించారు. కానీ, గత ఎన్నికల్లో భాజపా నాయకురాలు స్మృతి ఇరానీ చేతిలో ఆయన ఓటమిపాలవడంతో కంచుకోటకు బీటలుపడ్డాయి.

**మూడు దశాబ్దాల్లో రెండో 'శర్మ'..** గాంధీ కుటుంబేతరులు ఈ స్థానం నుంచి పోటీ చేయడం గత మూడు దశాబ్దాల్లో ఇది రెండోసారి. 1991లో రాజీవ్ గాంధీ మరణం తర్వాత ఈ స్థానాన్ని సతీశ్ శర్మకు అప్పగించింది. ఆ ఉప ఎన్నికల్లో గెలిచిన శర్మ.. 1996లో రెండోసారి విజయం సాధించారు. అయితే, 1998లో మాత్రం భాజపా చేతిలో ఓటమిపాలయ్యారు. ఆ మరుసటి ఏడాదే మళ్లీ ఎన్నికలు జరగ్గా.. అమేఠీ మరోసారి కాంగ్రెస్ వశమైంది.

అప్పటి నుంచి గాంధీ కుటుంబసభ్యులే పోటీ చేయగా.. మళ్లీ ఇన్నేళ్లకు ఇతరులకు అవకాశమిచ్చారు. తాజా ఎన్నికల్లో అమేఠీ నుంచి కిశోరీ లాల్ శర్మను నిలబెట్టారు.

**నాడు సోనియా విజయంలో కీలక పాత్ర..** పంజాబ్‌లోని లుధియానాకు చెందిన కిశోరీ లాల్ గత నాలుగు దశాబ్దాలుగా గాంధీ కుటుంబానికి అత్యంత నమ్మకస్థుడు. 1987లో తొలిసారి ఈయన అమేఠీకి వచ్చారు. అప్పటి నుంచి ఈ నియోజకవర్గం కోసం పనిచేస్తున్నారు. 1999లో అమేఠీలో సోనియా గాంధీ విజయం సాధించడంలో ఈయన కీలక పాత్ర పోషించారు. సోనియా ఈ స్థానాన్ని వదులుకున్న తర్వాత కూడా అమేఠీలో పార్టీ వ్యవహారాలను కిశోరీ పర్యవేక్షిస్తున్నారు. ఆయన ఎంపికపై కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా హర్షం వ్యక్తం చేశారు. "కిశోరీ లాల్‌తో మా కుటుంబానికి చాలా ఏళ్లుగా అనుబంధం ఉంది. అమేఠీ, రాయ్‌బరేలీ ప్రజల కోసం ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు. ఆయన పోటీలో ఉండటం చాలా ఆనందంగా ఉంది" అని తెలిపారు.



# చెప్పానుగా.. ఆయన కొత్త సీటు వెతుక్కుంటారని..!

దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నియోజకవర్గం నుంచి తమ అగ్రనేత రాహుల్ గాంధీ పోటీ చేయనున్నట్లు కాంగ్రెస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. రాహుల్ కొత్త సీటు వెతుక్కుంటారని తాను ముందే చెప్పానని గుర్తుచేశారు. పశ్చిమ్ బెంగాల్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ వ్యాఖ్యలు చేశారు. "ఆ పార్టీ పెద్ద (సోనియాగాంధీని ఉద్దేశించి) ఒకరు ఎన్నికల్లో పోటీచేసే ధైర్యం చేయరని, పారిపోతారని గతంలో నేను పార్లమెంట్‌లో వెల్లడించాను. ఆమె రాజస్థాన్ నుంచి రాజ్యసభకు వెళ్లారు. యువరాజు వయనాడ్‌లో ఓడిపోనున్నారని, అక్కడ పోలింగ్ పూర్తయిన వెంటనే ఆయన మరో సీటు కోసం అన్వేషణ ప్రారంభిస్తారని చెప్పాను. అమేఠీ అంటే భయంవేసి రాయ్‌బరేలీ వైపు పరుగులు తీస్తున్నారు. భయపడకండి అని వారు అందరితో అంటారు. ఈ రోజు అదే నేను వారికి చెప్తున్నాను.. భయపడకండి, పారిపోకండి. ఈ ఎన్నికల ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎలాంటి ఒపీనియన్ పోల్స్ అవసరం లేదు" అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని తీసుకురాలేదని, కానీ ఓట్ల కోసం సమాజాన్ని ఎలా విభజించాలో మాత్రం తెలుసని విమర్శించారు. రాహుల్ పోటీపై కేంద్రమంత్రి స్మృతి ఇరానీ కూడా స్పందించారు. గాంధీ కుటుంబం నుంచి ఏ ఒక్కరూ కూడా అమేఠీలో పోటీ చేయడం లేదంటే ఎన్నికలకు ముందే వారు అక్కడ ఓటమిని అంగీకరించారనడానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ కంచుకోట అయిన అమేఠీకి 2004 నుంచి 2019 వరకు రాహుల్ ప్రాతినిధ్యం వహించారు. అయితే 2019లో స్మృతి ఇరానీ చేతిలో రాహుల్ ఓటమిపాలైన విషయం తెలిసిందే. ప్రస్తుతం వయనాడ్ సిట్టింగ్ ఎంపీ అయిన ఆయన అక్కడి నుంచి మరోసారి పోటీ చేశారు. ఈ క్రమంలోనే రాయ్‌బరేలీ నుంచి కూడా పోటీ చేస్తారని ప్రకటన వచ్చింది. ఇంతకాలం ఈ స్థానానికి ఆయన తల్లి సోనియా గాంధీ ప్రాతినిధ్యం వహించిన సంగతి తెలిసిందే.

# ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నిక చెల్లదు.. హైకోర్టు సంచలన తీర్పు



**హైదరాబాద్ మే 3(ప్రభాత సమాచారం)**

బీఆర్?ఎస్? ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నికపై హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. ఎమ్మెల్సీగా విఠల్? ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు ప్రకటించింది. రూ.50 వేలు జరిమానా కూడా విధించింది. దండె విఠల్ ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా 2022లో బీఆర్?ఎస్? తరఫున పోటీ చేసి గెలిచారు. ఆ ఎన్నికల్లో నామినేషన్ వేసిన కాంగ్రెస్ నాయకుడు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి ఆ తర్వాత ఉపసంహరించుకున్నట్లు రిటర్నింగ్? అధికారి ప్రకటించారు.

ఈ క్రమంలో దండె విఠల్? ఎన్నిక చెల్లదని ప్రకటించాలని కోరుతూ పత్తిరెడ్డి రాజేశ్వర్? రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. నామినేషన్?ను తాను ఉపసంహరించుకోలేదని పత్తిరెడ్డి రాజేశ్వర్? రెడ్డి పేర్కొన్నారు. తనను ప్రతిపాదించిన కిషన్? సింగారి తన సంతాలను ఫోర్జరీ చేసి నామినేషన్? ఉపసంహరణ పత్రాలను సమర్పించారని రాజేశ్వర్? రెడ్డి వాదించారు. రాజేశ్వర్? రెడ్డి పిటిషన్?పై సంతకాలను, నామినేషన్? ఉపసంహరణ పత్రాలపై సంతకాలను హైకోర్టు కేంద్ర ఫోరెన్సిక్? లేబొరేటరీకి పంపించి నివేదిక తెప్పించింది.

తీర్పును నాలుగు వారాలు నిలిపివేస్తూ : అడ్వకేట్? కమిషన్? నివేదిక, సాక్షుల విచారణ, ఇరువైపుల వాదనలు విన్న తర్వాత హైకోర్టు తీర్పును రిజర్వ్? చేసింది. విఠల్? ఎన్నికను రద్దు చేస్తూ తీర్పు హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. అయితే అప్పీల్? చేయడంతో కొంత సమయం ఇవ్వాలని విఠల్? తరఫు న్యాయవాది కోరడంతో తీర్పు అమలును నాలుగు వారాలకు నిలిపివేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

సుప్రీంకోర్టుకు వెళ్లనున్న ఎమ్మెల్సీ దండె విఠల్

అయితే హైకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత దండె విఠల్? స్పందించారు. ఈ ఎన్నిక చెల్లదని హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్? చేస్తూ సుప్రీంకోర్టుకు వెళతానని చెప్పారు. వేరే అభ్యర్థి నామినేషన్? ఉపసంహరణ సరిగా జరగలేదన్న కారణంతో ఈ తీర్పు వచ్చిందని అన్నారు. ఇతర అభ్యర్థి నామినేషన్? ఉపసంహరణ తనకు సంబంధం లేని వ్యవహారమని చెప్పారు. ఈ తీర్పుపై అప్పీల్?కు నాలుగు వారాల గడువు తనకు లభించిందని స్పష్టం చేశారు. హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టులో న్యాయం జరిగి స్టే వస్తుందని ఎమ్మెల్సీ దండె విఠల్? ఆశాభావం వ్యక్తం చేశారు.

# తెలంగాణకు కాంగ్రెస్ ప్రత్యేక మేనిఫెస్టో విడుదల



**హైదరాబాద్ మే 3(ప్రభాత సమాచారం)**

తెలంగాణ ప్రత్యేక మేనిఫెస్టోను కాంగ్రెస్ విడుదల చేసింది. ఐదు న్యాయాలు, తెలంగాణకు ప్రత్యేక హామీల పేరుతో మేనిఫెస్టో తెలుగు ప్రతిని రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ విడుదల చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ ముఖ్య నేతలు పాల్గొన్నారు.రాష్ట్ర అవసరాలు ఆలోచించి మరీ మేనిఫెస్టో తయారు చేశామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. దీని తయారీకి ఎంతో కసరత్తు చేశామని చెప్పారు. తమ పార్టీ నాయకులతోనే కాక వివిధ సంఘాలతో మాట్లాడామని అన్నారు. తెలంగాణ సమాజానికి మేలు చేసే ప్రతి ఒక్క అంశాన్నీ ఇందులో ఉంచామని వివరించారు. మేనిఫెస్టోలో కీలకమైన 23 అంశాలను ఉంచినట్లు, విభజన చట్టంలోని అంశాలను నెరవేర్చేలా దీనిని రూపొందించామని వెల్లడించారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

కాంగ్రెస్ తెలంగాణ ప్రత్యేక మేనిఫెస్టోలోని కీలక అంశాలు ఇవే..!

కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు
బయ్యారంలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం
రాష్ట్రంలో మైనింగ్ విశ్వవిద్యాలయం ఏర్పాటు
రామగుండం-మణుగూరు కొత్త రైల్వే లైను
రాష్ట్రంలో క్రీడా యూనివర్సిటీ ఏర్పాటు
యువత కోసం వివిధ రకాల యూనివర్సిటీల ఏర్పాటు
అంతర్జాతీయ ప్రమాణాలతో సాంస్కృతిక, వినోద కేంద్రం ఏర్పాటు
మేడారం జాతరకు జాతీయ హెూదా
గతంలో ఇచ్చిన హామీ మేరకు ఐటీఐఆర్ ప్రాజెక్టును ప్రారంభిస్తాం
భద్రాచలం వద్ద ఏపీలో విలీనమైన 5 గ్రామాలను మళ్లీ రాష్ట్రంలో కలుపుతాం
4 సైనిక పాఠశాలలు ఏర్పాటు
కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు ఏర్పాటు
కేంద్ర నిధులు నేరుగా స్థానిక సంస్థలకు అందేలా చర్యలు
సౌరశక్తి ఉత్పత్తిని ప్రోత్సహిస్తాం
సుప్రీంకోర్టు ప్రత్యేక బెంచ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు
ఏపీలో కలిపిన 5 గ్రామాలను మళ్లీ రాష్ట్రంలో విలీనం
పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హెూదా
నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు పెంచుతాం

పాంచ్ న్యాయ్, పచ్చీస్ గ్యారంటీ..!పాంచ్ న్యాయ్, పచ్చీస్ గ్యారంటీలో భాగంగా మేనిఫెస్టో తయారుచే శామని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసిందని ఆరోపించారు. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు అనేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. పార్టీ నేతలు, కార్యకర్తలు గడప గడపకూ మేనిఫెస్టోను తీసుకెళ్లాలని శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు.అన్నివర్గాలతో మాట్లాడి మేనిఫెస్టో తయారు : అన్నివర్గాలతో మాట్లాడి మేనిఫెస్టో తయారు చేశారని రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ అన్నారు. ఈ కమిటీలో ఉన్న అందరికీ అభినందనలు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేరలేదని, ఆ పార్టీ నేతల నినాదాలు చూసి ప్రజలు భయపడుతున్నారని ఆరోపించారు. సీబీఐ, ఈడీ, ఐటీ దాడులతో విపక్ష నేతలు ఆందోళనకు గురవుతున్నా రని విమర్శించారు. దేశ ప్రజలకు న్యాయం జరగాలనే రాహుల్ గాంధీ జోడో యాత్ర చేపట్టారని అన్నారు. దేశం బాగుండాలంటే రాహుల్ ప్రధాని కావాలని ప్రజలు కోరుతున్నారని దీపాదాస్ మున్షీ వెల్లడించారు.యువత, మహిళలు, రైతులు, కార్మికులకు న్యాయం జరిగేలా మేనిఫెస్టో ఉందని కాంగ్రెస్ నేత అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. ఇప్పటివరకు ఐదు గ్యారంటీలు అమలు చేశామని ఆయన చెప్పారు. రాష్ట్రానికి అన్నిరకాలుగా మేలు చేసేలా మేనిఫెస్టో ఉందని అజారుద్దీన్ తెలిపారు. అన్నివర్గాల ప్రజలకు లబ్ధి జరిగేలా దీనిని తయారు చేశామని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు మరో 8 రోజులపాటు కష్టపడి ప్రచారం చేయాలన్నారు. ఈ మేనిఫెస్టో రాష్ట్రానికి బంగారు భవిష్యత్‌ను ఇస్తుందని ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. దీనిని ప్రతి గడప దగ్గరికీ తీసుకెళ్లాలని నేతలు పిలుపినిచ్చారు.

# ప్రభాకర్‌రావు కోసం పోలీసుల వేట .. అరెస్టు వారెంట్ ఇవ్వాలని కోర్టులో పిటిషన్

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి నాంపల్లి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. విదేశాల్లో ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును అరెస్టు చేయడానికి అనుమతివ్వాలని విజ్ఞప్తి చేశారు. సీఆర్పీసీ 73 ద్వారా అరెస్ట్ వారెంట్ జారీ చేయాలని కోరారు. ప్రస్తుతం ప్రభాకర్‌రావు అమెరికాలో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటి వరకు నలుగురు పోలీసు అధికారులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. పోలీసు కస్టడీలో వారు చెప్పిన వివరాల ఆధారంగా ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా ఉన్న ప్రభాకర్‌రావు ఫోన్ ట్యాపింగ్‌లో కీలకంగా వ్యవహరించారని దర్యాప్తు బృందం గుర్తించింది. కేసు నమోదైన వెంటనే ఆయన విదేశాలకు వెళ్లిపోయారు. ఎక్కడ ఎయిర్ పోర్టులో దిగినా పట్టుకునేందుకు వీలుగా ఇప్పటికే పోలీసులు లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు. రెడ్ కార్నర్ నోటీసు, ఇంటర్‌పోల్ అధికారులను దర్యాప్తు బృదం సంప్రదించాలంటే కోర్టు అనుమతించాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో సీఆర్పీసీ 73 ద్వారా అరెస్టు వారెంట్ జారీ చేయాలని పోలీసులు పిటిషన్‌లో పేర్కొన్నారు.

# తెలంగాణలో డిగ్రీలో ప్రవేశాలకు 'దోస్త్' నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని అన్ని డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం 'డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ' (దోస్త్) నోటిఫికేషన్ విడుదలైంది. మే 6 నుంచి 25 వరకు మొదటి ఫేజ్ రిజిస్ట్రేషన్ ఉండనుంది. రూ.200 రుసుంతో రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. మే 15 నుంచి 27 వరకు 'దోస్త్' వెబ్ ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. జూన్ 3న మొదటి దశ సీట్ల కేటాయింపు.. జూన్ 4 నుంచి 10 లోపు సెల్ఫ్ రిపోర్టుకు అవకాశం కల్పించారు. రూ.400 రుసుంతో జూన్ 4 నుంచి 13 వరకు సెకండ్ ఫేజ్ రిజిస్ట్రేషన్ నిర్వహించనున్నారు. జూన్ 4 నుంచి 14 వరకు సెకండ్ ఫేజ్ వెబ్ ఆప్షన్లు ఉంటాయి. జూన్ 18న రెండో దశ సీట్ల కేటాయింపు జరుగుతుంది. జూన్ 19 నుంచి 24 వరకు సెల్ఫ్ రిపోర్టుకు అవకాశం కల్పించారు. జూన్ 19 నుంచి 25 వరకు 'దోస్త్' మూడో దశ



రిజిస్ట్రేషన్ ఉండనుంది. రూ.400 రుసుంతో మూడో విడత రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. జూన్ 19 నుంచి 25 వరకు మూడో దశ వెబ్ ఆప్షన్లు ఉంటాయి. జూన్ 29న మూడో దశ సీట్ల కేటాయింపు జరుగుతుంది. జులై 8 నుంచి డిగ్రీ కళాశాలల తరగతులు ప్రారంభమవుతాయి.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660